క్లుప్తంగా

1న కాణిపాకంలో దర్శనాలు మాత్రమే

- కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): ఆంగ్ల నూతన సంవత్సరం జనవరి 1న కాణిపాక ఆలయంలో సంబరాలు ఏమీ లేవని, స్వామివారి దర్శనాలు మాత్రమే ఉంటాయని ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ దేవదాయ, ధర్మదాయ శాఖ ఆదేశాల మేరకు జనవరి 1న శుభాకాంక్షలు తెలుపుకోవడం భారతీయ వైదిక విధానం కాదన్నారు. అలాగే శుభాకాంక్షలు తెలుపుకోవడం హిందూ సంప్రదాయం కాదని హిందూ ధర్మపరిరక్షణ ట్రస్ట్, దేవదాయ, ధర్మదాయ శాఖ తెలిపారన్నారు. అయితే జనవరి 1న భక్తులు స్వామివారి దర్శనార్థం అధిక సంఖ్యలో విచ్చేస్తారని భావించి, వారి సౌకర్యార్థం ఆలయానికి వచ్చే వాహనాలను స్వామివారి ఉచిత డార్మెటరీ ఎదురుగా పార్కింగ్ చేయాలన్నారు. అలాగే స్వామివారి దర్శనార్థం వచ్చే భక్తులు కోవిడ్ ప్రోటోకాల్ నిబంధనలు పాటించాలని కోరారు. ప్రసాదాలు పంపిణీ చేసే సిబ్బంది ఈ నెల 30న శనివారం ఉదయం 9 గంటలకు ఈఓ కార్యాలయం వద్ద జరిగే సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

వాహనాల వేలం

చిత్తూరు అర్బన్: వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను గురువారం చిత్తూరులోని ఎస్ఈబీ కార్యాలయంలో వేలం వేశారు. మూడు వాహనాలను వేలం వేయగా రూ.35,700 ఆదాయం వచ్చిందని, జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి రూ.6,400 చెల్లించినట్లు అధికారులు పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల ర్యాలీ



యాదమరి: కుష్టువ్యాధిగ్రస్తుల సర్వేను సమగ్రంగా చేపట్టాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి అనీల్‌కుమార్ నాయక్ తెలిపారు. ఆయన గురువారం ఆసుపత్రి సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి కుష్టువ్యాధికి సంబంధించి సర్వే చేయాలన్నారు. ఎవరికైనా స్పర్శలేని గోధుమ రంగు మచ్చలు ఉంటే వారిని ప్రభుత్వాసుత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మినారాయణ, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, అనసూయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కనకాచారి



కనకాచారి



భాస్కర్ రెడ్డి

యాదమరి: విజయవాడలో రెండు రోజుల క్రితం నిర్వహించిన పీఆర్‌టీయూ రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో యాదమరి ఉపాధ్యాయులకు చోటు లభించింది. యాదమరి మండలం కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు కనకాచారి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగాను, భాస్కర్ రెడ్డి రాష్ట్ర కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిని గురువారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు సన్మానించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన



క్షేత్ర సందర్శనలో అధికారులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం ఒంటిళ్ల అనంతాపురంలో గురువారం మండల మహిళా సమైఖ్య అధికారులు ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన చేశారు. సేంద్రియ పద్ధతిలో లోకేష్ సాగు చేస్తున్న పంటలను ఏపీఎం విజయభాస్కర్, డీఆర్‌డీఏలోని ఎఫ్‌పీఓ సూరి తదితరులు పరిశీలించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, దిగుబడి, పెట్టుబడి తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. జీవామృతం తయారీ గురించి రైతు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది నాంచారమ్మ, గురుప్రసాద్, నీలకంఠ, షర్మిల, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మినీ మార్కెట్ యార్డులో సర్వే

వి.కోట: మండలంలోని శివునికుప్పంలో మినీ మార్కెట్ యార్డు ఏర్పాటు పనులను గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, డీఈఈ (చిత్తూరు) సిబ్బందితో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం మినీ మార్కెట్ కోసం మంజూరైన 7.09 ఎకరాల స్థలాన్ని స్థానిక సర్వేయర్లతో సర్వే చేసిన అనంతరం అధికారులు మాట్లాడారు. స్థలాన్ని లీజుకు ఇవ్వడం కోసం మార్కింగ్ ప్రక్రియ చేస్తున్నట్టు తెలిపారు.

తిరుగులేని పార్టీగా నిలబెట్టండి

- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద



ఇరువారంలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, మేయర్ అముద

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని, వివిధ పథకాల లబ్ధిదారుల ఖాతాల్లో లక్షలాది రూపాయలు ఇప్పటివరకు జమ చేసిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద తెలిపారు. గురువారం స్థానిక ఇరువారంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. తొలుత సచివాలయంలో సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును, కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. గతంలో ఏ పార్టీ అయినా ఇంత అభివృద్ధి, సంక్షేమం అందించిందా? ప్రజలందరూ ఒక్కసారి ఆలోచించి వైఎస్సార్ సీపీని తిరుగులేని పార్టీగా నిలబెట్టాలని కోరారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము, నగర సచివాలయ కన్వీనర్లు రామ్‌గణేష్, కిరణ్, డివిజన్ ఇన్‌చార్జి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక 25వ డివిజన్ బాలాజీకాలనీలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షులు జ్ఞానజగదీష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా గణిత బోధన



మాట్లాడుతున్న డీవైఈవో చంద్రశేఖర్

తవణంపల్లె: విద్యార్థులకు అర్థమయ్యేలా గణితాన్ని బోధించాలని డీవైఈవో చంద్రశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన గురువారం తవణంపల్లె హైస్కూల్లో తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు మండలాలకు చెందిన గణిత ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవో హేమలత పరిశీలించారు. ఎస్‌ఏ-1 పరీక్ష ఫలితాలను పాఠశాలల వారిగా విశ్లేషించారు. సీ గ్రేడు విద్యార్థులను ఏ గ్రేడ్‌కు తీసుకువచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు దుర్గాప్రసాద్, రవి, సీఆర్‌సీ హెచ్‌ఎం శ్రీరంజని పాల్గొన్నారు.

న్యాయవాదుల క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, న్యాయవాదులు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర న్యాయవాదుల క్రమ శిక్షణా సంఘ అధ్యక్షులు నల్లారి ద్వారకనాథరెడ్డి రూపొందించిన నూతన సంవత్సర న్యాయవాదుల క్యాలెండర్లను గురువారం జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమారావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు శాంతి, శ్రీదేవి, న్యాయవాదుల సంఘ అధ్యక్షులు రాజేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్, న్యాయవాదులు గుణశేఖర్‌రెడ్డి, బిందు, మేరి, సుబ్రమణ్యంరెడ్డి తదిరతులు పాల్గొన్నారు.

పటిష్టంగా కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

బంగారుపాళెం: మండలంలో కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది పటిష్టంగా చేపట్టాలని తుంబకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ లోహిత్ చెంగల్‌రాయస్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో గురువారం కుష్టువ్యాధిగ్రస్తుల సర్వేపై వైద్య, ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బుధవారం నుంచి జనవరి 12వ తేదీ వరకు ఇంటింటి సర్వే చేపట్టినట్లు తెలిపారు. ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సర్వేచేసి అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. వారిని పీహెచ్‌సీకి పంపించాలని సూచించారు. అనంతరం కుష్టువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీపీఎం మణి, ఎంపీహెచ్ఈవో రమేష్ బాబు, ఏపీఎంవో హరికృష్ణ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలంలో గురువారం చేసిన దాడుల్లో ఎస్ఈబీ అధికారులు కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు బంగారుపాళ్య మండలం పాలేరు బ్రిడ్జి వద్ద అధికారులు, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. మొగిలి వెంకటగిరికి చెందిన రాజేష్ (37)అక్రమంగా తరలిస్తున్న 768 కర్ణాటక మద్యం బాటిళ్లను సీజ్ చేసి, అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రాథమిక విచారణలో బంగారుపాళ్యంకు చెందిన అంజాద్ ఖాన్(37) అనే వ్యక్తి మద్యం సరఫరా చేస్తున్నట్లు తేలింది. దీంతో అతడిపై కూడా కేసు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. తనిఖీలో ట్రైనీ ఏఈఎస్ శ్రీరాం, ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది క్రిష్ణయ్య, సుబ్రమణ్యం గౌడు, కిరణ్‌కుమార్, వెంకటేష్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పనిచేయాలి

- డీఐఓ రవిరాజు



మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: వైద్యులు సేవా దృక్పథంతో పనిచేయాలని డీఐఓ రవిరాజు అన్నారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం కొత్తగా విధుల్లో చేరిన వైద్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పిలుపునిచ్చారు. పల్లెటూళ్ల ప్రజలకు అందుబాటులో ఉండాలని, విధుల్లో అలసత్వం వహించరాదని, తమ వైద్యసేవలతో పీహెచ్‌సీ ఓపీల సంఖ్యను పెంచాలని ఆయన సూచించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని మాపాక్షి అర్బన్ హెల్త్ సెంటర్‌ను గురవారం డీఐఓ రవిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్ర నిర్వహణ రికార్డులను పరిశీలించారు. ఓపీ వివరాలపై ఆరా తీశారు. వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహించరాదని సిబ్బందికి హితవు పలికారు. సమపాలన పాటించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. గర్భిణులకు ప్రభుత్వం అందించే సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.

పారిశుద్ధ్య పనుల తనిఖీ



పారిశుద్ధ్యం పనుల తనిఖీలో కమిషనర్

చిత్తూరు అర్బన్: నగరంలోని కట్టమంచి చెరువు కట్ట, కూరగాయల మార్కెట్ ప్రాంతాలను నగర కమిషనర్ జె.అరుణ గురువారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కట్టమంచి చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్‌ను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, వాకర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. క్రమం తప్పకుండా గ్యాంగ్ వర్కులు చేస్తూ చెరువు కట్టపై పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. పనులు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. అనంతరం కూరగాయల మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించారు. మార్కెట్ లో రోజూ ఉదయం శుభ్రం చేయాలని, వ్యర్థాలను ఇష్టారాజ్యంగా పడేయకుండా వ్యాపారస్తులకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టండి

పురపాలక శాఖ పరిధిలో ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె పిలుపు నేపథ్యంలో నగరపాలక పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి పెట్టాలని కమిషనర్ ప్రజారోగ్య విభాగం అధికారులను, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరపాలక కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి మార్గనిర్దేశం చేశారు. ప్రధాన రహదారుల్లో స్వీపింగ్ పనులకు, క్షేత్రస్థాయిలో చెత్త సేకరణకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అధిక మొత్తంలో వ్యర్థాల సేకరణకు సంబంధించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అవసరమైతే డ్వాక్రా మహిళల సాయం తీసుకోవాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, పారిశుద్ధ్య పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలకు ఆరోగ్యశ్రీ కార్డులు



ఆరోగ్యశ్రీ స్మార్టు కార్డులను అందజేస్తున్న ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి

బంగారుపాళెం: గ్రామ సచివాలయాలకు ఆరోగ్యశ్రీ కొత్త హెల్త్ కార్డులను పంపించనున్నట్టు ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆరోగ్యశ్రీ స్మార్ట్ హెల్త్ కార్డులను గురువారం ఆరోగ్యమిత్ర హరితకు అందజేసి ఆయన మాట్లాడారు. తగ్గువారిపల్లె గ్రామ సచివాలయ పరిధి ప్రజల కార్డులను అందజేశామన్నారు. ఈవోపీఆర్‌డీ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించడానికే ఆడుదాం ఆంధ్రా



తవణంపల్లె హైస్కూల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో



ఐరాల :కికెట్ పోటీలను ప్రారంభిస్తున్న పూజారి మోహన్‌రెడ్డి

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడానికే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మండలంలోని అరగొండ, తవణంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో క్రీడా పోటీలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు ఆటల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తవణంపల్లెలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ హరిరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



తవణంపల్లె : అరగొండ హైస్కూల్లో కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా

ఐరాల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ నేత పూజారి మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గురువారం ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, ఎంపీడీవో నాగరాజు, ఎంఈవో రుష్యేంద్రబాబు, నేతలు ధచంద్రారెడ్డి, సురేంద్ర యాదవ్, పంచాయతీ కార్యదర్శి శ్యామల పాల్గొన్నారు.

మారనున్న రోడ్ల రూపురేఖలు





బీఎస్ఆర్‌పేటలో హైలెవల్ బ్రిడ్జి ఏర్పాటు స్థలం వద్ద పరిశీలిస్తున్నఅధికారులు, 197 రామాపురంలో..







పలమనేరులో ఎం.కొత్తూరు దారి, వి.కోటలో నాయకనేరి ఎస్.బండపల్లె రహదారి, ఎంకేపురం దారి

- హై ఇంపాక్ట్ రోడ్డు పనులకు ఆమోదం
- జిల్లాలో 22.73 కి.మీ రోడ్లకు రూ.31.64 కోట్లు కేటాయింపు
- టెండర్లు ఆహ్వానించిన పంచాయతీరాజ్ శాఖ

ప్రాంతం	కిలోమీటర్లు	విలువ రూ.కోట్లు
చిత్తూరు	3.43	14.39
గుడిపాల	2.20	2.45
పలమనేరు	3.50	4.50
వి.కోట	2	1.30
రామకుప్పం	6	7
శాంతిపురం	5.60	2
మొత్తం	22.73	31.64

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. రవాణా సౌకర్యాలపై దృష్టి సారించింది. జిల్లాలో పూర్తి అధ్వానంగా ఉన్న రహదారులను హై ఇంపాక్ట్ పనుల కింద బాగు చేసేందుకు పూనుకుంది. ప్రతి నియోజకవర్గం నుంచి పూర్తి అధ్వానంగా హైఇంప్టాక్ ఉన్న రోడ్లను ఎంపిక చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో కొత్తగా రోడ్ల పనులకు టెండర్లు పిలిచారు.

రూ.31.64 కోట్లతో పనులు

పీఆర్ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లాలో ఏడు ప్రాంతాల్లో 22.73 కిలోమీటర్ల రోడ్లను రూ.31.64 కోట్లతో బాగు చేయనున్నారు. గతంలో అధ్వానంగా ఉన్న రోడ్లు ఇక రూపురేఖలు మారనున్నాయి. చిత్తూరులో అంబేడ్కర్ భవన్ నుంచి పీవీకేఎన్ కళాశాల సమీపం వరకు, బీఎస్ఆర్‌పేటలో పొన్నైనది సమీపంలో హైలెవ్ బ్రిడ్జి, గుడిపాలలో 197 రామాపురం నుంచి సింగరపుపేట, పలమనేరులో పలమనేరు-గుడియాత్తం రోడ్డు టు ఎం.కొత్తూరు వయా ఉసరపెంట, వి.కోట నాయకేనరి-ఎస్.బండపల్లె వయా సుదలకుప్పం, రామకుప్పం 89 పెద్దూరు-అంబూరు రోడ్డు, శాంతిపురంలో ఎంకేపురం వయా పూనేపల్లె ప్రాంతాలను ఎంపిక చేశారు.

టెండర్లు పిలిచాం



జిల్లాలో హై ఇంపాక్ట్ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు ఆహ్వానించాం. జిల్లాలో ఎక్కువగా మరమ్మతులైన రోడ్లను ఎంపిక చేశాం. మొత్తం 22.73 కిలోమీటర్లు రూ.31.64 కోట్లతో బాగు చేస్తాం.

–చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఈ, పంచాయతీరాజ్

విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రత్యేక అదాలత్



విద్యుత్ అదాలత్‌లో సమస్యలు నివేదిస్తున్న వినియోగదారులు

–చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి

పలమనేరు: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే ట్రాన్స్‌కో డివిజన్ కేంద్రాల్లో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు విద్యుత్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. స్థానిక ఏడీ కార్యాలయ ఆవరణలో కమిటీ సభ్యులు రామ్మోహన్‌రావు, అంజనీకుమార్, ఈశ్వరమ్మ ఈ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ కరెంటు బిల్లులు, ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం, పలుమార్లు విన్నవించినా పరిష్కారం కాని సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల రీ-ప్లేస్‌మెంట్‌లలో ఆలస్యాలు, రీడింగ్ తక్కువగా ఉండి ఎక్కువగా వచ్చిన బిల్లులు తదితరాల పరిష్కారానికి ఇదే సరైన వేదిక అన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పలమనేరు డివిజన్ పరిధిలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, ఇంటి సర్వీసులు, లైన్ల మార్పు, అదనపు లోడు మంజూరు, అధిక కరెంటు బిల్లులకు సంబంధించి ఫిర్యాదులందాయి. డీఈ శ్రీనివాసమూర్తి, ఏడీ చిన్నబ్బ, పలు మండలాల ట్రాన్స్‌కో ఏఈలు పాల్గొన్నారు.

ప్రథమ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ



చిత్తూరు అర్బన్: విశాఖపట్నంలో నిర్వహించనున్న ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి ప్రథమ మహాసభకు సంబంధించిన పోస్టర్లను గురువారం చిత్తూరు నగరపాలక సంస్థలో ఆవిష్కరించారు. నగరపాలక సంస్థ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. గోపాలకృష్ణ వర్మ మాట్లాడుతూ, నగరపాలక సంస్థల్లో వ్యవస్థీకృత అభివృద్ధి ఉద్యోగుల ప్రయోజనాలు, హక్కుల సాధనే ధ్యేయంగా విశాఖపట్నం గురజాడ కళాక్షేత్రం వేదికగా జనవరి 7న నిర్వహించే రాష్ట్రస్థాయి ప్రథమ మహాసభ కార్యక్రమాన్ని మున్సిపల్ ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ దొప్పలపూడి, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, నగర పాలక సంస్థ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తనూజ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమామహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షులు కోదండన్, సురేష్ కుమార్, జాయింట్ సెక్రెటరీ అమర్నాథరెడ్డి, రుక్మాంగద, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు సాగు చేయండి



'ఆకుముడత' నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు చెబుతున్న వ్యవసాయాధికారి

గుడిపాల: చెరువు ఆయకట్టు రైతులకు గురువారం వసంతాపురం రైతు భరోసా కేంద్రంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా రైతులకు స్థానిక సర్పంచ్ రజనీకాంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి మాధవి మాట్లాడుతూ, వరికి బదులుగా చిరుధాన్యాలైన రాగి, కొర్రలు, సజ్జలు సాగు చేయాలన్నారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందులు వాడరాదన్నారు. వరిలో సన్నరకం వడ్లు మాత్రమే సాగుచేయాలని, బుడ్డరకం వడ్లు సాగు చేయరాదన్నారు. చెరువుల అభివృద్ధి, భూగర్భ జలాలకు సంబంధించిన విషయాలను ఆమె వివరించారు. మిరప పంటలో ఆకుముడత తెగులు ఆశించకుండా సజ్జలు వేసుకోవాలని, వాటిని ఎలా వేయాలో రైతులకు ప్రదర్శనపూర్వకంగా క్షేత్రస్థాయిలో చూపించారు. కార్యక్రమలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఈ హేమంత్

గుడిపాల: జలజీవన్ మిషన్ పథకంతో గ్రామాల్లో తాగునీటి సమస్యను తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్ హేమంత్ కుమార్ అన్నారు. గురువారం వసంతాపురం సచివాలయంలో పశుమంద, వసంతాపురం గ్రామస్తులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికీ మంచినీటి కొళాయి ఏర్పాటు చేయడమే జలజీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. దీంతో పాటు ప్రభుత్వ భవనాలకు కూడా నీటి సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రజనీకాంత్, పంచాయతీ కార్యదర్శి పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.